# నీటిమెట్లు

టేంక్‌బండ్ ఫుట్‌పాత్ బల్లమీద చతికిలబడుతూ, 'ఈ ఊరికి అరగంట ముందువచ్చి ఉంటే ఇన్ని బాధలు పడాల్సి ఉండేవి కాదు' అనుకున్నాడు రవి. ఉదయం నుండి ఆమాట చాలాసార్లు అనుకున్నాడు. చాలా దూరం నడవడం వలన కాళ్ళు నొప్పిగా ఉన్నాయి. సాయంత్రం అయితేగాని ప్రకాశాన్ని కలుసుకోడానికి వీలుపడదు.

సమయం మధ్యాహ్నం ఒంటిగంట దాటింది.

తను హైదరాబాద్‌కు వచ్చిన బస్సు సమయానికి ముందే వచ్చింది. బస్సు దిగిన తర్వాత ప్రకాశం ఇల్లు కనుక్కోవడమే కష్టమయింది. రవి హైదరాబాద్ రావడం అది మొదటిసారేం కాదు. లోగడ నాలుగయిదుసార్లు వచ్చాడు. వచ్చిన ప్రతిసారీ ఊరు వేగంగా మారిపోవడం గమనించాడు. గుర్తు పట్టడం కష్టమయింది. ఆటోవాడు తనను చుట్టూ తిప్పి తీసుకువచ్చిన సంగతి ప్రకాశం ఇల్లు దొరికిన తర్వాత తెలిసివచ్చింది. తనకు మరుసటి రోజు ఇంటర్వ్యూ ఉంది. రెండుసార్లు దీర్ఘ టెలిఫోనిక్ ఇంటర్వ్యూలు చేసి చివరిగా పర్సనల్ ఇంటర్వ్యూకు రమ్మని పిలిచారు. తొంబయి అయిదు శాతం ఉద్యోగం వచ్చినట్లే. మిగిలిన అయిదు శాతం ఏమవుతుందో తెలియదు. చాలా ఇంటర్వ్యూలకు వెళ్ళి విసుగెత్తి పోయాడు. వయసు దాటి పోతోంది.ప్రతి ఉద్యోగానికి అనుభవం అడుగుతున్నారు. డిగ్రీ పూర్తిచేసి ఇన్ని సంవత్సరాలయినా ఎందుకు ఏమీ చేయలేదని మరో ప్రశ్న. ఉద్యోగం వస్తే అనుభవం వస్తుంది. కనీసం దారి తెలుస్తుంది. ఇంజనీరింగ్ ముగించడానికి చాలా ఖర్చు అయింది. అంత అవుతుందని అనుకోలేదు. డిగ్రీ పూర్తి చేశాక అక్కరకొస్తాయని కంప్యూటర్ కోర్సులుచేశాడు. వాటికే చాలా అయింది. మార్కెట్ త్వరితగతిన మారి పోతోంది. నిలబడడం కష్టంగా ఉంది.

ప్రకాశం తనతోనే చదువుకున్నాడు. గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్నాడు. మొదట్లో అతనికి నెలకు రెండువేలే ఇచ్చేవాళ్ళు. కొద్దిగా అనుభవం సంపాదించి మరో ఉద్యోగం చూసుకున్నాడు. ప్రస్తుతం ముప్పయి అయిదువేల వరకు సంపాదిస్తున్నాడు. మోటారుబైక్ కొనుక్కున్నాడు. బేంకులోనుతో అపార్టుమెంటు తీసుకునే ఉద్దేశంలో ఉన్నాడు. పోయినసారి వచ్చినప్పుడు కారు కొనుక్కునే ప్రపోజలుకూడా ఉంది. కొన్నాడో లేదో తెలియదు. తనతో చదువుకున్న వాళ్లలో తనే ఎటూ కాకుండా పోయాడు. చాలా మంది అమెరికా వెళ్ళిపోయారు.

చొక్కా జేబులోంచి డబ్బు బయటకు తీసి లెక్కపెట్టుకున్నాడు రవి. మూడువందల యాభై అయిదురూపాయలున్నాయి. నోట్ల మధ్యలో ఇంటర్వ్యూ కార్డు ఉంది. అరచేయంత లేమినేటెడ్ కార్డది. అందులో "మీరు ఇంటర్వ్యూకి వచ్చేటప్పుడు దయచేసి ఈ కార్డు తీసుకురండి. సెక్యూరిటీ కారణాల వలన ఈ కార్డు లేకపోతే కంపెనీలోకి ప్రవేశించడానికి అనుమతించరు" అని ఇంగ్లీషులో ఉంది. ఆ కార్డు వంక ఒకసారి చూసి తిరిగి డబ్బులతో పాటు జేబులో పెట్టుకున్నాడు. రాత్రి ప్రయాణం వలన బడలికగా ఉంది.

రవి ప్రకాశం ఇల్లు వెతికి పట్టుకునే సరికి ప్రకాశం ఉద్యోగానికి వెళ్ళిపోయాడు. రవి నిరుత్సాహ పడ్డాడు. హోటలులో ఉండేంత డబ్బులు లేవు. ప్రకాశం మొబైలుకు ఫోన్‌చేశాడు. "మా కంపెనీలో సమస్యేమిటంటే ఒకసారి ఇన్ అయ్యాక, ఏదో పెద్ద కారణమయితే తప్ప, బయటకు రానీయరు. సాయంత్రానికి కాని నేను రాలేను. ఏమనుకోకు. మా పక్కింట్లో సూటుకేసు పెట్టి ఏ సినిమాకు వెళ్ళో కాలం గడిపేయి. సాయంత్రం ఆరింటికి తప్పకుండా నిన్ను కలుస్తాను" అన్నాడు ప్రకాశం.

సూట్‌కేసు ప్రకాశం పక్కింట్లో పెట్టి హైదరాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చి కాలకృత్యాలు ముగించి కేఫ్టీరియాలో టిఫినుచేసి నడుచుకుంటూ టేంక్‌బండ్ చేరుకున్నాడు రవి. సాయంత్రం వరకు ఎలాగో ఒకలాగ గడపాలి.

అతను పదినిమిషాల పాటు కూర్చున్నాడో లేదో అతని వెనకాల ఆటోరిక్షా ఆగింది. వెనక్కి తిరిగి చూశాడు. ఆటోలోంచి ఎర్రటి చీర కట్టుకున్న తెల్లటి మనిషి చాలా హుందాగా దిగింది. సన్నగా, పొడుగ్గా ఉంది. గాలికి తల మీది జుట్టు చిందరవందరయినా ఆమె అందంగా ఉంది. మేచింగ్‌గా చేతికి ఎరుపురంగు గాజులు ఉన్నాయి. కాలివేళ్లకు మెట్టెలు ఉన్నాయి.

మీటరు చూసి ఇరవయి రూపాయల కాయితం ఇచ్చి చిల్లర తీసుకోలేదు, చేతులు ఖాళీగా మిగిలాయి. ఎటూ చూడలేదు. అడుగులో అడుగు వేసుకుంటూ రవి కూర్చున్న బల్ల పక్కగా నడుస్తూ కొద్దిగా దూరం వెళ్లి రెయిల్సుకు ఆనుకుని బుద్ధుడి విగ్రహం వయిపు చూడసాగింది. అటూ ఇటూ వేగంగా వెళ్లే కార్లూ, ఆటో రిక్షాలూ స్కూటర్లు తప్ప ఫుట్‌పాత్ మీద జనసంచారం అట్టే లేదు. ఎండ పల్చగా ఉంది. గాలి విసురుగా వీస్తోంది.

ఆమె వచ్చిన ఆటో రిక్షా ముందు చక్రం ట్యూబు పంక్చరయినట్టుంది. ఆటో అతను చక్రం విప్పదీసి మార్చడానికి కూర్చున్నాడు. ఆమె రవి వంక ఒకసారి చూసి, చెప్పులు విడిచి కొద్దిగా ఇవతలకు వచ్చి వెనక్కి తిరగకుండా రోడ్డుకు అవతల చెట్టు కింద ఆడుకుంటున్న పిల్లల వంక చూస్తోంటే రవి దృష్టి పిల్లల వయిపు సారించాడు.

రెండు నిమిషాల పాటు పిల్లలను చూసి ఉంటాడేమో, చటుక్కున తలతిప్పి ఆమె నిలుచున్న వయిపు చూశాడు. ఆమె కనబడలేదు. నీళ్ళలో దూకిందా, ఏమిటి? అతని గుండె భారం కాసాగింది. అటూ ఇటూ చూశాడు. ఆమె కనబడలేదు. ఆమె చెప్పులు అక్కడే ఉన్నాయి. 'నీళ్ళలో దూకేసిందా?' అనుకుంటూ ఉండగానే అతని గుండె ఝల్లుమంది. 'అలా కాకూడదు' అని కూడా అనుకున్నాడు. వెంటనే లేచి రెయిలింగ్ దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చి రెయిలింగ్‌కు ఆనుకుని ముందుకు వంగి చూశాడు.

అప్పటికే ఆమె ఒక మునుగు మునిగి పయికి వచ్చింది. అంత అందంగా వున్న వ్యక్తి ఎందుకు ఆత్మహత్య చేసుకోదల్చుకుందో? ఇరవయి అయిదు సంవత్సరాలు కూడా ఉండవు. రవి ఏమాత్రం ఆలస్యం చేయలేదు. రెయిలింగ్ ఎక్కి నీళ్లలోకి దూకాడు.

కొద్దిగా కష్టపడితేనేగాని ఆమెను రవి అందుకోలేకపోయాడు. అందిన చేతిని వదలలేదు. గట్టిగా పట్టుకున్నాడు. గాజులు పగిలి పోతూ ఇద్దరికీ గుచ్చుకుంటు న్నాయి. అతనికి ఇబ్బందిగా అనిపించలేదు. తన చేతిని అతని చేతిలోంచి విడిపించుకోవడానికి ప్రయత్నం చేస్తూ రెండోచేత్తో అతన్ని నెట్టేయడానికి ప్రయత్నించింది. అతను వీలు కానీయలేదు. రవి ఆమె దగ్గరకువచ్చి నడుం చుట్టూ చేయివేసి గట్టిగా పట్టుకుని అతి కష్టంమీద ఆమెను పయికి తీసుకువచ్చి రెయిలింగ్ చప్టామీద కూర్చోబెట్టాడు. అదృష్టవశాత్తూ ఆమె నీళ్ళు మింగలేదు. మళ్ళీ రెయిలింగ్

ఎక్కి నీళ్ళలో దూకదన్న విశ్వాసం కుదిరాక గాని ఆమెచేయి వదలలేదు. అతను ఆయాసపడుతూ ఆమె ఎదురుగా నిలబడడం వలన ఈ సంఘటన ఎవరి దృష్టి ఆకర్షించలేదు.

అతను ఆమె ఎదురుగా ఉండకుండా ఉండాల్సింది.

ఆమె స్థిమిత పడ్డాక ఆత్మహత్యా ప్రయత్నం చేసినందుకు ఆమెమీద అరవాలనిపించింది రవికి. ఆమె ముఖంలోకి చూశాక అరవలేకపోయాడు. ఏడుస్తోంది. ఇద్దరి గుడ్డలు తడిచిపోయాయి. కోపం దిగమింగుకుంటూ, “ఎందుకింత పిచ్చిపని చేశారు?” నెమ్మదిగా అడిగాడు. ఆమె చిన్నగానే ఏడుస్తూ తల అడ్డంగా ఆడించింది. ఆమెను ఎలా ఓదార్చాలో అర్థం కావడం లేదు.

చొక్కాకు అంటిన బురద తుడుచుకుంటూ జేబు తడుముకున్నాడు. జేబు లోవి బయటకు తీశాడు. డబ్బు తడిచిపోయి ఉందికాని ఇంటర్వ్యూ కార్డు కనిపించలేదు. నీళ్ళలో పడిపోయి ఉండాలనిపించింది. వెంటనే ఎక్కడలేని భయం కమ్ముకు వచ్చింది. రెయిలింగ్‌కు ఆనుకుని ముందుకు వంగి నీళ్ళలోకి చూశాడు. ఆకార్డు లేకపోతే తనకు ఉద్యోగం జారిపోయినట్టే. మరో ఉద్యోగం ఈ గడ్డుకాలంలో దొరుకుతుందో, లేదో? ఆమెను రక్షించడానికి ఎక్కడ దూకాడో అక్కడ వెదికితే తన కార్డు తప్పకుండా దొరుకుతుంది అనుకున్నాడు. ఏమాత్రం ఆలస్యం చేయలేదు. రెయిలింగ్ ఎక్కి సరిగ్గా అక్కడి నీళ్లలో దూకాడు.

ఆటో అతను చక్రం మార్చడం పూర్తిచేసి బయల్దేరడానికి సిద్ధమవ్వబోతోంటే ఆమె లేచి, ఆటో దగ్గరకు వచ్చి లోపల కూర్చుని, “నన్ను ఎక్కడినుండి తీసుకు వచ్చావో అక్కడే వదిలిపెట్టు” అంది. అవతలిపక్క పిల్లలు ఆడుకుంటూ కేరింతలు కొడుతోంటే తన పిల్లలు గుర్తువచ్చారు. భర్త కూడా గుర్తు వచ్చాడు. తను లేకుండా వాళ్ళెలా ఉండగలరు? అసలు ఉండగలరా? అనుకుంది. ఈ ఆలోచనకు దుఃఖం మరోసారి కట్టలు తెంచుకుంది. ఆటో అక్కడినుండి కదులుతోంటే జనం ఒక్కొక్కరే అక్కడ మూగసాగారు.

రవి రెండో మునక వేశాక, ఈతరాని వాడు కావడం వలన, మళ్ళీ తేలలేదు. చాలామంది అక్కడ గుమిగూడిన సమయానికి ఆటో చాలాదూరం వెళ్ళిపోయింది. ఆమెచెప్పులు మటుకు ఫుట్‌పాత్‌మీదే ఉండిపోయాయి.

❖ రచన, ఆదివారం వార్త, 24 ఫిబ్రవరి 2008